## క్లుప్తంగా

### నేడు వైకుంఠ ఏకాదశి వేడుకలు

అన్నపురెడ్డిపల్లి: మండల కేంద్రంలో కొలువుదీరిన భూదేవి, శ్రీదేవి సమేత శ్రీబాలాజీ వేంకటేశ్వరస్వామి వారి ఆలయంలో శనివారం వైకుంఠ ఏకాదశి వేడుకలను ఘనంగా నిర్వహించనున్నట్లు ఆలయ మేనేజర్ రమణ శుక్రవారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. తెల్లవారుజాము నుంచి ఉదయం 8 వరకు ఆలయ ఉత్తర ద్వారం నుంచి భక్తులకు దర్శనం ఇవ్వనున్నారని, ఉత్తర ద్వార దర్శనానికి అన్ని ఏర్పాట్లు చేశామన్నారు. స్వామివారి ఉత్తర ద్వార దర్శనం, గరుడ సేవలో భక్తులు పెద్దసంఖ్యలో పాల్గొనాలని ఆలయ మేనేజర్ కోరారు.

### లోక్ అదాలత్‌ను సద్వినియోగం చేసుకోవాలి

ములకలపల్లి : కొత్తగూడెం కోర్టులో ఏర్పాటు చేయనున్న లోక్ అదాలత్‌ను సద్వినియోగం చేసుకోవాలని ఎస్సై సాయికిషోర్‌రెడ్డి శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. వెహికిల్ సీజ్, యాక్సిడెంట్, డ్రంకెన్ డ్రైవ్, డ్రైవింగ్‌లైసెన్స్, మైనర్ డ్రైవింగ్ కేసులు, ఈ–పెట్టీ, చీటింగ్, వివాహ సంబంధ రాజీపడదగిన కేసులు పరిష్కరించుకోవచ్చని పేర్కొన్నారు. నేటి నుండి ఈనెల 30 వరకు నిర్వహించే లోక్ అదాలత్ సబందింత వివరాల కోసం స్థానిక పోలీస్‌స్టేషన్‌లో సంప్రదించాలని తెలిపారు.

### మసీద్ కమిటీ అధ్యక్షుడిగా మహబూబ్ పాషా

బూర్గంపాడు: మండల కేంద్రం బూర్గంపాడులోని యాసిన్ మసీద్ కమిటీ నూతన అధ్యక్షుడిగా మహబూబ్ పాషాను శుక్రవారం ఎన్నుకున్నారు. ఈ మేరకు నూతన కమిటీని ఎన్నుకోగా కమిటీ గౌరవ అధ్యక్షుడిగా ఎంఏ.జబ్బార్, ఎండీ.అమీరుద్దీన్, ఉపాధ్యక్షులుగా ఎండీ.షాహతాజ్, ట్రెజరర్‌గా బషీర్‌లను ఎన్నుకున్నారు.

### నేడు క్రిస్మస్ కానుకల పంపిణీ

మణుగూరు రూరల్: క్రిస్మస్ పండుగ పురస్కరించుకుని నేడు తహసీల్దార్ కార్యాలయంలో కలెక్టర్ ప్రియాంక అల, ఎమ్మెల్యే పాయం వెంకటేశ్వర్లు చేతుల మీదుగా క్రిస్మస్ కానుకలు పంపిణీ చేయనున్నట్లు తహసీల్దార్ రాఘవరెడ్డి శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. ప్రజాప్రతినిధులు, అధికారులు, క్రైస్తవులు హాజరై విజయవంతం చేయాలని పేర్కొన్నారు.

### నూతన ప్రిన్సిపాల్‌ను నియమించాలి

భద్రాచలంటౌన్: భద్రాచలం పట్టణంలోని గిరిజన బీఈడీ కళాశాలలో నూతన ప్రిన్సిపాల్‌ను నియమించాలని గోండ్వానా సంక్షేమ పరిషత్ రాష్ట్ర అధ్యక్షుడు పాయం సత్యనారాయణ శుక్రవారం ఒక ప్రకటనలో డిమాండ్‌చేశారు. ప్రస్తుతం విధులు నిర్వహిస్తున్న ప్రిన్సిపాల్‌కు పాలన పరంగా అవగాహన లేకపోవడంతో గిరిజన విద్యార్థులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని పేర్కొన్నారు. ఏజెన్సీ ప్రాంతంలో ఎన్‌సీటీఈ నిబంధనల ప్రకారం విద్యా విభాగంలో పీహెచ్‌డీ, కళాశాలలో 8 ఏళ్ల బోధన అనుభవం ఉన్న వారికి ప్రాధాన్యత ఇవ్వాలని కోరారు.

### వ్యాధులపై అప్రమత్తంగా ఉండాలి



నిల్వ నీటిని తొలగిస్తున్న సిబ్బంది

చర్ల రూరల్: వ్యాధులపై జాగ్రత్తగా ఉండాలని కొయ్యూరు పీహెచ్‌సీ వైద్యాధికారి శ్రీధర్ కోరారు. మండలంలోని గొల్లగూడెం గ్రామంలో శుక్రవారం వైద్య శిబిరాన్ని ఏర్పాటు చేశారు. అనంతరం ఫ్రైడే డ్రైడే పరిశీలించి ఇంటింటికి వెళ్లి నీటి నిల్వలను పూర్తిగా తొలగించాలని తద్వారా దోమలు వ్యాపించవని సూచించారు. ఈ కార్యక్రమంలో వైద్య సిబ్బంది రాంప్రసాద్, హైమావతి, ధర్మారావు, సౌజన్య, ఆశ కార్యకర్తలు పాల్గొన్నారు.

### పొదెం వీరయ్యకు మంత్రి పదవి ఇవ్వాలి



మాట్లాడుతున్న వనమా గాంధీ

అన్నపురెడ్డిపల్లి: భద్రాచలం మాజీ ఎమ్మెల్యే పొదెం వీరయ్యకు కాంగ్రెస్ అధిష్టానం ఎమ్మెల్సీ ఇచ్చి, మంత్రి పదవి కట్టబెట్టాలని పార్టీ మండల నాయకులు కోరారు. శనివారం మండల కేంద్రంలోని ఆ పార్టీ కార్యాలయంలో వారు మాట్లాడుతూ.. నాలుగు దశాబ్దాలుగా పార్టీని నమ్ముకొని, పార్టీ ఎదుగుదల కోసం నిరంతరం పనిచేసిన నాయకుడు పొదెం వీరయ్య అని అన్నారు. పార్టీ మండలాధ్యక్షుడు వనమా గాంధీ, సర్పంచ్ బోడా పద్మ, బాణావత్ భీముడు, పర్సా వెంకటేశ్వర్లు, యాదాల వెంకన్న, ఇనపనురి జమలయ్య, కొమరయ్య, బడుగు ముత్తయ్య పాల్గొన్నారు.

# హైలెస్సా.. హైలెస్సా..

**పర్ణశాలలో వైభవంగా శ్రీ సీతారాముల తెప్పోత్సవం**

- కట్టుదిట్టంగా బందోబస్తు



స్వామివారిని పల్లకీలో మోసుకొస్తున్న అధికారులు



గోదావరికి హారతి సమర్పణ



తెప్పోత్సవ కార్యక్రమం



శ్రీ సీతారామచంద్రస్వామి వారు

దుమ్ముగూడెం: ప్రముఖ పుణ్యక్షేత్రమైన పర్ణశాల శ్రీసీతారామచంద్రస్వామి ఆలయంలో ముక్కోటి ఏకాదశి ఉత్సవాలను పురస్కరించుకుని శుక్రవారం నిర్వహించిన తెప్పోత్సవ కార్యక్రమం వైభవంగా నిర్వహించారు. ఈ సందర్భంగా అర్చకులు శేషం కిరణ్‌కుమార్ చార్యులు, అమరవాది కిషోర్ చార్యులు, భరద్వాజ చార్యులు, నరసింహాచార్యులు ప్రత్యేక పూజలను నిర్వహించారు. సాయంత్రం స్వామి వారిని ఊరేగింపుగా గోదావరి తీరానికి తీసుకొచ్చి అందంగా అలంకరించిన హంసవాహనంపై శ్రీ సీతారామచంద్రస్వామి వారిని కూర్చోబెట్టి పవిత్ర గోదావరిలో విహరింపచేశారు. దీంతో నదీతీరం రామనామస్మరణతో మారుమోగింది.

**కట్టుదిట్టమైన భద్రత..**

తెప్పోత్సవం నేపథ్యంలో ఎలాంటి అవాంచనీయ సంఘటనలు చోటుచేసుకోకుండా పోలీసులు గట్టి బందోబస్తు ఏర్పాటు చేశారు. నేడు ముక్కోటి ఏకాదశి పర్వదినం పురస్కరించుకుని భక్తులకు ఉత్తరద్వారంలో స్వామి వారి దర్శనం కలుగచేసేందుకు ఆలయంలో ప్రత్యేక ఏర్పాట్లను ఆలయ అధికారులు చేశారు. ఈ కార్యక్రమంలో తహసీల్దార్ చంద్రశేఖర్, ఎంపీడీఓలు చంద్రమౌళి, ముత్యాలరావు, సీఐ దోమల రమేష్, ఎస్ఐ కేశవరావు, జెడ్పీటీసీ తెల్లం సీతమ్మ,సర్పంచ్ తెల్లం వరలక్ష్మీ, ఆలయ ఏఈఓ శ్రావణ్‌కుమార్, అనిల్‌కుమార్, ఆలయ సూపరింటెంట్ కిషోర్ , ఆర్ఐలు లక్ష్మయ్య, ఆదినారాయణ, పంచాయతీ కార్యదర్శులు పాల్గొన్నారు.

**బాణాసంచా లేక నిరాశ..**

తెప్పోత్సవం కార్యక్రమంలో బాణాసంచా లేకపోవడం భక్తులను నిరాశ పరిచింది. రెండేళ్ల క్రితం జరిగిన జరిగిన ఘటన నేపథ్యంలో అధికారులు బాణాసంచా కాల్చడం నిషేధించారు. దీంతో ఈ ఏడాది కూడా బాణాసంచా లేకపోవడంతో భక్తులు కొంత నిరాశపడ్డారు.

# పండుగ పేరుతో హోటళ్లలో దోపిడీ

- సిండికేట్‌గా ఏర్పడి అధికారులకు ముడుపులు?
- భక్తులను దోచుకుంటున్నా పట్టించుకోని వైనం
- కలెక్టర్ ఆదేశాలు బేఖాతర్

భద్రాచలంటౌన్: ప్రముఖ పుణ్యక్షేత్రమైన భద్రాచలం శ్రీసీతారామచంద్ర స్వామివారి దేవస్థానం ఆధ్వర్యంలో జరిగే రెండు అతి పెద్ద వేడుకలు శ్రీరామనవమి, ముక్కోటి ఏకాదశి ఉత్సవాలు. ఈ పండుగలకు తెలుగు రాష్ట్రాల నుంచే కాకుండా సరిహద్దు రాష్ట్రాల నుంచి భక్తులు అధిక సంఖ్యలో తరలివస్తారు. ఇదే అదునుగా భావిస్తున్న భద్రాచలం హోటల్ యజమానులు ఓ అసోసియేషన్(సిండికేట్)గా ఏర్పడి అధిక ధరలకు తినుబండారాలను విక్రయిస్తూ భక్తులను దోచుకుంటున్నారు. అధికారులు నిర్ధేశించిన ధరల ప్రకారం హోటళ్లలో తినుబండారాలను భక్తులకు విక్రయించాలి. అందుకు ఫుడ్‌సేఫ్టీ, పౌరసరఫరాల శాఖ అధికారులు నిత్యం తనిఖీ చేసే విధంగా బాధ్యతలు అప్పగిస్తారు. వారు హోటళ్లలో తినిబండారాల నాణ్యత పరిశీలించి ధరల వివరాలను ఎప్పటికప్పుడు తెలుసుకోవాలి. ఇలా చేస్తే లాభాలు ఉండవని నిబంధనల విరుద్ధంగా హోటళ్ల యజమానులు ప్రవర్తిస్తున్నారు.

**సిండికేట్‌గా ఏర్పడి..**

భద్రాచలంలోని చిన్న పెద్ద హోటళ్లు సుమారు వందకు పైగానే ఉన్నాయి. అందరూ కలిసి అసోసియేషన్(సిండికేట్)గా ఏర్పడి హోటళ్లకు కొంత మొత్తం సేకరించి అధికారులకు ముట్ట చెబుతున్నారనే ప్రచారం జోరుగా సాగుతోంది. దీంతో అధికారులు హోటళ్ల వైపు చూడకపోవడంతో వారు ఆడిందే ఆట.. పాడిందే పాటగా అధిక ధరలకు తినుబండారాలను భక్తులకు విక్రయిస్తూ సొమ్ము చేసుకుంటున్నారు. ఈ విషయమై భక్తులు అధికారులకు ఫిర్యాదులు చేసినా వారి కనుసన్నల్లోనే జరుగుతుందని కాబట్టి చర్యలు శూన్యం. ఉన్నతాధికారుల నుంచి ఒత్తిడి వస్తే నామమాత్రపు తనిఖీలు చేసి చేతులు దులుపుకుంటున్నారు. కలెక్టర్ సైతం సమావేశం ఏర్పాటు చేసి భక్తులు నాణ్యమైన తినుబండారాలను సరసమైన ధరలకు విక్రయించే విధంగా పర్యవేక్షించాలని అధికారులకు సూచించిన ఆమె ఆదేశాలను అధికారులు బేఖాతర్ చేశారనే ఆరోపణలు వినిపిస్తున్నాయి. ఇప్పటికైనా ఉన్నతాధికారులు స్పందించి నాణ్యమైన తినుబండారాలను సరసమైన ధరలకు పట్టణంలోని హోటళ్ల యజమానులు విక్రయించే విధంగా చర్యలు తీసుకోవాలని భక్తులు కోరుతున్నారు.

### భద్రాద్రికి పాదయాత్రగా..



భద్రాచలంటౌన్: రామాలయం వద్దకు చేరుకున్న భక్తులు



బూర్గంపాడు: అయప్పస్వామి మాలధారులు

భద్రాచలంటౌన్: భద్రాద్రి శ్రీసీతారామచంద్ర స్వామివారి ముక్కోటి ఏకాదశి సందర్భంగా దర్శించుకునేందుకు భక్తులు పాదయాత్రగా శుక్రవారం భద్రాద్రి వచ్చారు. ఏపీలోని ఎన్టీఆర్ జిల్లా తిరువూరు, గంపలగూడెం మండలాలకు చెందిన శ్రీసత్యమాంబతేశ్వర్ గురుస్వామ్ ఆధ్వర్యంలో సుమారు 300 మంది రామ భక్తులు శుక్రవారం పాదయాత్రగా భద్రాద్రి వచ్చి రామయ్యను దర్శించుకున్నారు. ఈ సందర్భంగా వారు ఆలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించారు.

బూర్గంపాడు: సనాతన ధర్మాన్ని కాపాడాలని కోరుతు అయ్యప్ప స్వామి మలాధారులు శుక్రవారం ఇరవెండి శ్రీ సంతాన వేణుగోపాలస్వామి ఆలయం నుంచి భద్రాచలం రామాలయం వరకు పాదయాత్ర చేపట్టారు. సతీష్, రమేష్ గురుస్వాముల ఆధ్వర్యంలో 30 మంది అయ్యప్ప స్వామి మాలాధారులు పాదయాత్రగా భద్రాచలం చేరారు. ఈ కార్యక్రమంలో బాలాజీ, వీరబాబు, కృష్ణ, సతీష్, కొండయ్య, నరసింహారావు, మురళీకృష్ణ, సాయి, తేజ, నాగరాజ్ తదితరులు పాల్గొన్నారు.

# ఎంపీల సస్పెండ్ సరికాదు



అంబేడ్కర్ విగ్రహం వద్ద నిరసన తెలుపుతున్న ఎంపీపీ సుజాత, నాయకులు

అశ్వాపురం: సమవేశాల సమయంలో పార్లమెంట్‌లో ఆగంతకులు చొరబడిన సందర్భంగా బందోబస్తుపై ప్రశ్నించినందుకు ఇండియా కూటమికి చెందిన 145 మంది ఎంపీలను సస్పెండ్ చేయడాన్ని ఖండిస్తూ కాంగ్రెస్ పార్టీ ఆధ్వర్యంలో శుక్రవారం అంబేడ్కర్ విగ్రహానికి వినతిపత్రం అందజేశారు. ఈ మేరకు అంబేడ్కర్ విగ్రహం వద్ద నల్ల జెండాలతో నిరసన తెలిపారు. ఈ సందర్భంగా నాయకులు మాట్లాడుతూ.. ఎంపీలను సస్పెండ్ చేయడం హేయమైన చర్య అన్నారు. దీనికి బీజేపీ ప్రభుత్వం తగిన మూల్యం చెల్లించక తప్పదన్నారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ మండలాధ్యక్షుడు ఓరుగంటి భిక్షమయ్య, ఎంపీపీ ముత్తినేని సుజాత, సర్పంచ్ బాణోత్ శారద, మండల కో ఆప్షన్ సభ్యుడు ఎస్‌కే.ఖధీర్, సీపీఐ మండల కార్యదర్శి అనంతనేని సురేష్, నాయకులు గాదె కేశవరెడ్డి, సదర్‌లాల్, పాడియం అనిల్, వలబోజు మురళీకృష్ణ, అంజిబాబు, మోసిన్, రాజేష్, కాళిదాసు తదితరులు పాల్గొన్నారు.

### అక్షింతలతో ర్యాలీ



ర్యాలీ నిర్వహిస్తున్న మాలధారులు

గుండాల: అయోధ్య శ్రీ సీతారామచంద్ర స్వామివారి అక్షింతలు మండల కేంద్రానికి చేరడంతో శుక్రవారం ర్యాలీ నిర్వహించి రామాలయానికి చేర్చారు. జనవరి 1 నుంచి మండలంలోని అన్ని గ్రామాల్లో ఇంటింటికి పంపిణీ చేస్తామని కమిటీ సభ్యులు తెలిపారు.రవి, నాగరాజు, టి.సురేష్, శ్రీను, కృష్ణ, యాకయ్య, శ్యామ్, సుజిత్, సుధాకర్, శావణ్, వెంకటేశ్వర్లు, విద్యాసాగర్ తదితరులు ఉన్నారు.

# గుర్తింపు సంఘం ఎన్నికల్లో గెలిపించాలి



మాట్లాడుతున్న మధు

మణుగూరు రూరల్ : ఈ నెల 27న జరగబోయే సింగరేణి గుర్తింపు కార్మిక సంఘ ఎన్నికల్లో సీఐటీయూని గెలిపించాలని యూనియన్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి బి.మధు కార్మికులకు విజ్ఞప్తి చేశారు. శుక్రవారం మణుగూరు ఏరియాలోని ఓసీ20, వర్క్‌షాప్, మణుగూరు ఓసీలలో నాయకులు ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. కార్మికుల హక్కులు కాపాడాలన్నా, సంస్థ పరిరక్షణ, సొంతింటి కల నెరవేరాలన్న కార్మికుల తదితర సమస్యలను పరిష్కరించాలంటే సూర్యుడు గుర్తుపై ఓటు వేసి గెలిపించాలని విజ్ఞప్తి చేశారు. ఈ కార్యక్రమంలో నాయకులు కె.బ్రహ్మాచారి, టీవీఎంవీ ప్రసాద్, వెంకటేశ్వర్లు, డీవీ, గద్దల శ్రీనివాస్, మాచారపు లక్ష్మణరావు, నందం ఈశ్వర్‌రావు, విల్సన్, వై రామ్మూర్తి, రాములు, సూర్యనారాయణ, నరసింహరావు, సత్రపల్లి సాంబశివరావు, హేమంతరావు, వెంకన్న సంఘం నాయకులు తదితరులు పాల్గొన్నారు.

**టీబీజీకేఎస్‌ను గెలిపించాలి..**

సింగరేణి గుర్తింపు కార్మిక సంఘ ఎన్నికల్లో పోటీ చేసేందుకు టీబీజీకేఎస్‌కు అధిష్టానం గ్రీన్ సిగ్నల్ ఇచ్చిందని, కార్మిక సంఘం ఎన్నికల్లో బాణం గుర్తుపై ఓటు వేసి గెలిపించాలని యూనియన్ బ్రాంచ్ ఉపాధ్యక్షులు వూకంటి ప్రభాకర్‌రావు కోరారు. ఈ మేరకు జరిగిన సమావేశం, గేట్ మీటింగ్‌లో ఆయన మాట్లాడుతూ.. కార్మికుల అధైర్యపడొద్దని, కార్మిక హక్కుల కోసం, కార్మిక శ్రేయస్సు కోసం ఎన్నో సంక్షేమ కార్యక్రమాలను చేపట్టిందన్నారు. మణుగూరు ఏరియాలో వంద కోట్ల రూపాయలతో సంక్షేమ, అభివృద్ధి కార్యక్రమాలను నిర్వహించడం జరిగిందన్నారు. గత తొమ్మిదేళ్ల 64పైగా డిమాండ్లను సాధించిందన్నారు. ఈ కార్యక్రమంలో నాయకులు అబ్దుల్ రవూఫ్, వీరభద్రయ్య, డీవీ, శ్రీనివాస్, బాలాజీ, ఆదిశంకర్ తదితరులు పాల్గొన్నారు.

### 25 నుంచి కరోనా పరీక్షలు



ఐసోలేషన్‌లో బెడ్‌లను పరిశీలిస్తున్న వైద్యులు

అశ్వారావుపేటరూరల్: ఉన్నతాధికారుల ఆదేశాలతో కరోనా కేసులపై స్థానిక వైద్య శాఖ అప్రమత్తంగా ఉన్నామని, ఈ నెల 25 నుంచి స్థానిక ప్రభుత్వ సామాజిక ఆస్పత్రిలో కరోనా నిర్ధారణ పరీక్షలు చేయనున్నట్లు ఆస్పత్రి మెడికల్ ఆఫీసర్ డాక్టర్ పూర్ణచంద్రరావు తెలిపారు. శుక్రవారం ఆయన మాట్లాడుతూ.. కరోనా వ్యాప్తి నేపథ్యంలో ముందస్తు జాగ్రత్తల్లో భాగంగా స్థానిక ప్రభుత్వ సామాజిక ఆస్పత్రిలో కరోనా కేసుల కోసం ప్రత్యేకంగా ఒక వార్డుతోపాటు, ఐసోలేషన్ కోసం ఐదు బెడ్‌లను కేటాయించామన్నారు. ఆందోళన చెందొద్దని, ప్రతి ఒక్కరూ అప్రమత్తంగా ఉండాలని సూచించారు.

### క్రీడా సామర్థ్యాలను పెంచుకోవాలి



కిట్లు అందజేస్తున్న ఎస్సై రాజ్‌కుమార్

బూర్గంపాడు: యువత క్రీడా సామర్థ్యాలను పెంచుకోవాలని, అందుకోసం తప్పనిసరిగా శిక్షణ తీసుకోవాలని బూర్గంపాడు ఎస్సై రాజ్‌కుమార్ అన్నారు. సారపాకలోని గాంధీనగర్ యువతకు పోలీస్‌శాఖ ఆధ్వర్యంలో శుక్రవారం వాలీబాల్, క్రికెట్ కిట్లను ఆయన అందించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. క్రీడానైపుణ్యాలను పెంచుకుంటే జీవితంలో ఉన్నతంగా రాణించవచ్చన్నారు. క్రీడలతో పాటుగా సామాజిక సేవా కార్యక్రమాలపై దృష్టి పెట్టాలన్నారు. ఈ కార్యక్రమంలో సిబ్బంది, యువకులు పాల్గొన్నారు.

# ఘనంగా గణిత దినోత్సవం



చర్ల రూరల్: గణితశాస్త్ర ప్రాజెక్టులతో విద్యార్థులు



బూర్గంపాడు: ప్రదర్శనలో విద్యార్థులు

బూర్గంపాడు: గణిత శాస్త్రవేత్త శ్రీనివాస రామానుజన్ జయంతి పురస్కరించుకుని జాతీయ గణిత దినోత్సవాన్ని శుక్రవారం ఘనంగా నిర్వహించారు. ఈ మేరకు సారపాకలోని బ్రిలియంట్ స్కూల్‌లో విద్యార్థులు గణితశాస్త్ర ప్రాజెక్టులతో ప్రదర్శనలు చేశారు. వ్యాసరచన. క్విజ్ పోటీలను నిర్వహించి విజేతలకు బహుమతులను అందించారు. కరస్పాండెంట్ బి.నాగేశ్వరరావు, ఉపాధ్యాయులు ఉన్నారు.

దుమ్ముగూడెం : మండలంలోని నర్సాపురం గ్రామంలోని సూదిరెడ్డి నాగిరెడ్డి ఆదిలక్ష్మమ్మ మెమోరియల్ ఉన్నత పాఠశాల, దుమ్ముగూడెం ప్రభుత్వ జూనియర్ కాలేజీలో శ్రీనివాస రామానుజన్ జన్మదిన వేడుకలు ఘనంగా శుక్రవారం నిర్వహించారు. ఈ సందర్భంగా రామానుజన్ చిత్రపటానికి ప్రధానోపాధ్యాయులు వెంకటేశ్వర్లు, కాలేజీ ప్రిన్సిపాల్ ఎల్ వెంకటేశ్వర్లు పూల మాల వేసి నివాళులర్పించారు. విద్యార్థులకు వ్యాస రచన, గణిత ముగ్గుల పోటీలు, గణిత క్విజ్, డ్రాయింగ్ పోటీలు నిర్వహించి బహుమతులు ప్రదానం చేశారు. కల్లూరి బొర్రయ్య, సోయం కృష్ణ, తెల్లం సరస్వతి, ఉపాధ్యాయులు విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.

చర్ల రూరల్: చర్లలోని గురుదేవ్ విద్యాలయంలో శ్రీనివాస రామానుజన్ చిత్రపటానికి పాఠశాల ప్రధానోపాధ్యాయులు గిరి, అకడమిక్ కో ఆర్డినేటర్ సుబ్రహ్మణ్యం పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. ఈ సందర్భంగా విద్యార్థులు గణిత ప్రాజెక్టులను ప్రదర్శించారు.

దమ్మపేట: మండల పరిధిలోని పలు ప్రభుత్వ, ప్రైవేట్ పాఠశాలల్లో గణిత శాస్త్రవేత్త శ్రీనివాస రామానుజన్ జయంతి సందర్భంగా రామానుజన్ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ప్రదర్శనలో గెలుపొందిన విద్యార్థులకు హెచ్‌ఎంల చేతులమీదుగా బహుమతులను అందజేశారు.

మణుగూరు రూరల్ : మున్సిపాలిటీలోని పైలట్‌కాలనీలోని ఎక్సలెంట్ హైస్కూల్‌లో గణితశాస్త్ర ఉపాధ్యాయులను శాలువాలతో ఘనంగా సన్మానించారు. ఈ కార్యక్రమంలో కరస్పాండెంట్ ఎండి.ఖాదర్, డైరెక్టర్లు యూసఫ్‌షరీఫ్, యాకుబ్‌షరీఫ్, ఉపాధ్యాయులు ఏ.భద్రంబాబు, రాజారత్నం, జయచిత్ర, విజయ్, శ్రీలత విద్యార్థులు పాల్గొన్నారు. మండలంలోని గుట్టమల్లారంలో గల శ్రీచైతన్య పాఠశాలలో రామనుజన్ చిత్రపటానికి పాఠశాల ప్రిన్సిపాల్ సాయికృష్ణ ప్రసాద్ పూలమాల వేసి ఘన నివాళులర్పించారు. అనంతరం గణిత ఉపాధ్యాయులను సన్మానించారు. డీన్ నరేష్, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.



దుమ్ముగూడెంలో..



మణుగూరు రూరల్ : ఉపాధ్యాయులకు సన్మానం..



దమ్మపేట: రామానుజన్ చిత్రపటానికి నివాళులర్పిస్తున్న ఉపాధ్యాయులు, విద్యార్థులు



